యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కామారెడ్డి రూరల్, జూన్ 5: కామారెడ్డి జిల్లా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యున్నత ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నామని ఆ సంఘం అధ్యక్షుడు సాయన్న యాదవ్, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-2024 అకాడమిక్ సంవత్సరంలో పదవ తరగతిలో 9 జీపీఏకి పైగా, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలలో 90శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 9505200165, 9441046994 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు



జిల్లాలో కొనసాగుతున్న.. కాంగ్రెస్ హవా!

- మొన్న మెజార్టీ అసెంబ్లీ.. నేడు జహీరాబాద్ ఎంపీ స్థానం కైవసం
- కాంగ్రెస్ శ్రేణుల్లో విజయోత్సాహం
- ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ కాంగ్రెస్‌దే..
- ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌దే పై చేయి
- రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ఆధిక్యం
- మూడో స్థానానికే పరిమితమైన బీఆర్ఎస్



కామారెడ్డి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోగా నేడు ఎంపీ స్థానంపై సైతం కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ప్రతీ ఎన్నికలోనూ కాంగ్రెస్ హవా కొనసాగుతుండటంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో విజయోత్సవం నింపుతోంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ స్థానాన్ని సైతం కైవసం చేసుకుంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్‌కే అధిక ఓట్లు పడడం ఆ పార్టీ పై చేయి సాధించింది. మొదటి నుంచి అనుకున్న విధంగానే పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు చెందిన మెజార్టీ ఎమ్మెల్యేలు ఉండడంతో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ మొదటి రౌండ్ నుంచి ఆధిపత్యం కొనసాగించారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పై చేయి కొనసాగిస్తూ వచ్చింది. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డిలో మాత్రం బీజేపీకి ఆధిక్యత వచ్చింది. గతంలో రెండుసార్లు పార్లమెంట్ సీటును కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితమైంది. ఈ పార్లమెంట్ పరిధిలో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఆ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు పడకపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌కు కంచుకోట కామారెడ్డి

ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండటంతో జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా మారుతోంది. గతంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి వరుసగా గెలుపొందుతుండడంతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. గత సంవత్సరం నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ జహీరాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపొందారు. దీంతో జిల్లాలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బలం పెరుగుతోంది. ఇటీవల కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం సైతం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రానున్న సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తాచాటి మెజార్టీ స్థానాలను గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇలా జిల్లాలో కాంగ్రెస్ హవా కొనసాగించేందుకు ఆ పార్టీ ముఖ్యనేతలు దృష్టి సారిస్తున్నారు.



కామారెడ్డిలో టపాకాయలు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌దే పైచేయి

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గానికి మే 13న ఎన్నికలు జరగగా మంగళవారం ఓటర్ల తీర్పు వెలువడింది. ఈ తీర్పులో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ 47,893 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి బీబీ పాటిల్‌పై గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 5,23,919 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 4,76,023 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ 1,71,412 ఓట్లు వచ్చాయి. అయితే ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలను బట్టిచూస్తే అధికార పార్టీ కాంగ్రెస్‌కే ఎక్కువగా ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న మొదటి రౌండ్ నుంచి మొదలుకొని చివరి రౌండ్ వరకు కాంగ్రెస్‌దే పై చేయిగా నిలుస్తూ వచ్చింది. 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మెజార్టీ రావడం విశేషం. కామారెడ్డి, ఎల్లారెడ్డిలో మాత్రం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఆధిక్యత వచ్చింది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 66,527 ఓట్లు రాగా బీజేపీకి 85,610, బీఆర్ఎస్‌కు 23,285 ఓట్లు వచ్చాయి. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌కు 63,446, బీజేపీకి 79,335, బీఆర్ఎస్‌కు 20,715 ఓట్లు వచ్చాయి. బాన్సువాడలో కాంగ్రెస్‌కు 66,063, బీజేపీకి 57,200, బీఆర్ఎస్‌కు 27,043 ఓట్లు వచ్చాయి. జుక్కల్‌లో కాంగ్రెస్‌కు 63,577, బీజేపీకి 61,832, బీఆర్ఎస్‌కు 20,747 ఓట్లు వచ్చాయి. జహీరాబాద్ కాంగ్రెస్‌కు 1,03,129 ఓట్లు, బీజేపీకి 67,651, బీఆర్ఎస్‌కు 23,018 ఓట్లు వచ్చాయి. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్‌కు 78,280, బీజేపీకి 58,018, బీఆర్ఎస్‌కు 28,188 ఓట్లు వచ్చాయి. ఆందోల్‌లో కాంగ్రెస్‌కు 82,612, బీజేపీకి 66,118, బీఆర్ఎస్‌కు 34,186 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

జిల్లాలో జరుగుతున్న వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాహ కొనసాగుతుండటంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ జోష్ నింపుతోంది. ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గెలుపొందుతుండటం, మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ విజయోత్సాహం కొనసాగుతోంది. మొన్నటికి మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపొందడం, నేడు జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని సైతం కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ క్యాడర్ మరింత బలపడుతూ వస్తోంది. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరుగుతోంది.

నేటి నుంచి బడిబాట

- పాఠశాలల్లో సన్నాహక కార్యక్రమాలు
- 6-19 వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
- ఈనెల 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- గతేడాది ప్రభుత్వ బడులు సాధించిన విజయాలపై అవగాహన
- పెద్దఎత్తున విద్యార్థులను చేర్పించేలా కసరత్తు



బడి బయట పిల్లల సర్వే చేపడుతున్న విద్యాశాఖ సిబ్బంది (ఫైల్)

కామారెడ్డి టౌన్, జూన్ 5: మరో 6 రోజుల్లో వేసవి సెలవులు ముగిస్తుండడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల పునఃప్రారంభంపై రాష్ట్ర విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. గతేడాది పాఠశాలలు సాధించిన విజయాలను చూపిస్తూ ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ప్రోత్సహించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ప్రైవేట్ యాజమాన్యాలు గ్రామాల్లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ చేశాయి. ప్రభుత్వం బడుల్లో మాత్రం ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ముందు నామ మాత్రంగానే కార్యక్రమాలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఈ సారైన పూర్తిస్థాయిలో పిల్లలను బడిలో చేర్పిస్తారా అనేది వేచి చూడాలి.

నేటి నుంచి కార్యక్రమాలు ఇలా..

బడీడు పిల్లల్ని బడిలో చేర్పించేందుకు ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా గురువారం విలేజ్ ఆర్గనైజేషన్‌లతో కలిసి జయశంకర్ బడిబాట ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, బడీడు పిల్లలతో ప్రతిజ్ఞ, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు. 7వ తేదీన ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను దగ్గరలోని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలతో పాటు పాఠశాలలకు వెళ్లే పిల్లల వివరాలు విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వీఈఆర్)లో నమోదు చేస్తారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన, పాఠశాల యొక్క వివరాలను బ్రోచర్ల ద్వారా వివరించడం, బడి మానేసిన పిల్లలను చేర్పించడం, స్పెషల్ ఎడ్యుకేషన్ అవసరమైన పిల్లలకు భవిత సెంటర్లలో చేర్పించడం చేస్తారు. 11వ తేదీన గ్రామసభ ఏర్పాటు చేసి అంతకుముందు నిర్వహించిన వివరాలను ప్రజలకు తెలియజేస్తారు. ఎవరైనా పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలు ఉంటే నమోదు చేస్తారు. 12వ తేదీన పాఠశాలలను సుందరంగా తయారు చేసి పండుగ వాతావరణం తయారు చేస్తారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, కమ్యూనిటీ వర్గాలతో కలిపి తల్లిదండ్రులు, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేస్తారు. పుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫార్మ్ అందిస్తారు.

గత సంవత్సరం పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చిన విద్యార్థులను అభినందించడంతో పాటు ఇతర క్రీడల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులను పరిచయం చేస్తారు. 13 నుంచి 19 వరకు ఇతర కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు.

ఆచరణలో కనిపించని బడి బయట పిల్లల చేరికలు

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే విద్యా సంవత్సరంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బడిబయట ఉన్న పిల్లల సంఖ్య రోజురోజుకూ పెరుగుతునే ఉంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలతో పాటు చెత్త కుప్పల వెంట, హోటళ్లు తదితర ప్రాంతాల్లో పిల్లలు కనిపిస్తూనే ఉన్నారు. బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యపడడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చెప్పాల్సి ఉన్నా తూతూ మంత్రంగానే చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు ఇలా వచ్చి అలా వెళుతూ తమ సొంత వ్యాపారాలపై దృష్టి సారించడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదనే వాదనలు ప్రతీ సంవత్సరం బడిబాట చేపడుతున్న మిగిలిన ఉపాధ్యాయులకు ఎదురవడం చాలా ప్రాంతాల్లో కన్పిస్తోంది. కేవలం ప్రభుత్వ ఆదేశాలను మాత్రం చేపట్టి బడిబయట పిల్లలు సంవత్సరం పొడవున పాఠశాలల్లో విద్యను అభ్యసించేలా మాత్రం చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గ్రూప్ 1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, జూన్ 5: ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, బయోమెట్రిక్ శిక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బయోమెట్రిక్ చేసే విధానంపై అధికారులతో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4,792 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్ష రాయనున్నారని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. బయోమెట్రిక్ యంత్రాలు ఒకరోజు ముందు జిల్లాకు వస్తాయని, వాటిని పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు 12 మంది సూపరింటెండెంట్‌లు, పర్యవేక్షకులను, రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారులకు పరీక్షకు సంబంధించి సామగ్రిని అందజేశారు. పరీక్ష కేంద్రంలోకి వచ్చే మహిళ, పురుష అభ్యర్థులను తనిఖీ చేయుటకు పోలీసుశాఖ ద్వారా తగిన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రమోహన్, పరీక్ష రీజనల్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రైతులు విత్తనాలు కొనే సమయంలో రశీదు తీసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మీ

పెద్ద కొడప్‌గల్, జూన్ 5: జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సోదరులు ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ సూచించారు. బుధవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ దుకాణదారులు విత్తనాలు అమ్మే సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. దీంతో పాటుగానే దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మరాదని, గడువు ముగిసిన విత్తనాలు అమ్మవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ పట్టుపడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ విలేకరులతో మాట్లాడుతూ రైతులు వరి విత్తనాలు కొనే సమయంలో సంబంధిత వ్యవసాయాధికారి సలహాలు తీసుకోవాలని సూచించారు. రైతులు వరి విత్తనాలు తీసుకునే సమయంలో ఎటువంటి రకం తీసుకోవాలని అడుగుతుంటారని, అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన వంగడాలు తీసుకోవాలని సూచించారు. ఇక వరి పంటకు బోనస్ ఏ రకానికి ఇవ్వాలనే ఆదేశాలు తమకు ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత రైతు సోదరులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఇక రైతులు విత్తనాలు కొనే సమయంలో తప్పని సరిగా విత్తన డీలర్ల నుంచి రశీదులు తీసుకోవాలని దీనిపై డీలర్ సంతకం ముద్రతో పాటు రైతు సంతకం కూడా ఉండాలని తెలిపారు. దీంతో పాటుగానే విత్తనం తీసుకవచ్చిన సంచిని కూడా రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. విత్తనాలు సరిగ్గా మొలకెత్తకపోయినా.. పంట దిగుబడి రాకపోయినా సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేయడానికి రైతులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వాటికి కూడా ఆన్‌లైన్ చేస్తున్నామని, రైతులు పంట విత్తిన అనంతరం సంబంధిత ఏవో, ఏఈవోలు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నదీం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం మోస్రా రహదారి

● రోడ్డుకు ఇరువైపులా గుంతలు ● వాహన చోదకులకు ఇబ్బందులు ● పట్టి పట్టనట్టుగా సంబంధిత అధికారులు

మోస్రా,జూన్5: మండల కేంద్రం శివారులోని మోస్రా, చందూర్, బోధన్ మూడుదారుల కూడలి గుంతమయంగా మారింది. మోస్రా గ్రామం నుండి చింతకుంట ఎక్స్ రోడ్డు మూడు దారుల కూడలి దాదాపు మూడు కిలో మీటర్ల ప్రయాణంలో పదుల సంఖ్యలో గుంతలు ఉన్నాయి. గుంతల వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కూడలి వద్ద ప్రమాదం జరిగితే ఇబ్బందికరంగా మారుతుంది. సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బోధన్ రూరల్‌కు వర్నికి ఇదే బోర్డర్‌గా ఉంటుంది. అందుకే ఎవరి పరిధిలోకి వస్తుందో చెప్పటానికి జనాలకు అర్థం కాక నానా తిప్పలు పడుతున్నారు. అదే విధంగా మోస్రా నుండి నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో అలీసాగర్, కుర్నాపల్లి, కొత్తపేట్ ఎక్స్ రోడ్డు వద్ద మూడు రోడ్డుల కూడలి వద్ద ఎలాంటి ప్రమాదం జరిగిన ఏ పోలీసుల మండల పరిధికి వస్తుందో అనే అయోమయంలో ఉంటారు ప్రజలు, ఇక్కడ నిజామాబాద్ రూరల్ మండలం, మోస్రా మండలం కొంచెం దూరంలో అటు ఇటుగా ప్రమాదం జరిగినా నాపరిధి కాదు అంటారు.అధికారులు ప్రమాదాలు జరగకుడా ఉండాలన్న ఇక్కడ రోడ్డు అంటే అది రోడ్డు కాదు ఇక్కడ చెప్పలేనన్నీ ప్రమాదాలు జరిగాయి. కొన్ని ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు విగతజీవుల్లా బతుకుతున్నారు. మోస్రా బస్టాండ్ సమీపంలో బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహ దారిని అనుకుని ఉన్న కొన్ని హోటళ్లకు వచ్చే వారు వాహనాలు రోడ్డుపై నిలపడం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. అదే విధంగా ఇక్కడ మూడు దారుల కూడలి ఒకటి మోస్రా గ్రామంలోకి వెళ్లే ప్రదాన రోడ్డు ఇటు నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారి ఇక్కడ ఎటువంటి రోడ్డు మలుపు సూచిక బోర్డు గుర్తులు కాని స్పీడ్ బ్రేకర్‌లు కాని ఏర్పాటు చేయక తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.అదే విధంగా గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద మూల మలుపు ప్రమాదకరంగా ఉందని గత నెలలో ఓ వ్యక్తి ప్రాణాలు సైతం కోల్పోయాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో మాజీ సర్పంచ్ సుమలత రాంరెడ్డిరోడ్డు రవాణాశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసిన నేటి వరకు చర్యలు తీసుకోలేదంటే అతిశయోశక్తి కలగకమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేడియంతో కూడిన మూల మలుపు వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతల మయంగా మారిన వర్ని-మోస్రా రోడ్డు


గుంతల మయంగా మారిన రోడ్డు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మోస్రా, గోపూర్ గ్రామ శివారు ముగింపు వరకు నిజామాబాద్ - బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న రోడ్డు గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ఈ రహదారి పై ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- శ్రీనివాస్, స్థానికుడు, మోస్రా

అటవీ శాఖ అధికారుల అనుమతి కోసం అర్జి

అటవీ శాఖ అధికారుల అనుమతి కొరకు అర్జి పెట్టాము. వారి అనుమతి వచ్చిన వెంటనే పూర్తి పనులు చే స్తాం . వాహనదారులు ఇబ్బందులు పడకుండా గుంతల కు మరమ్మతులు చేపడతాం.

- జియాన్, ఆర్అండ్‌బీ ఏఈ, మోస్రా

ఉపాధి కూలీలకు స్వీట్ల పంపిణీ



కూలీలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్5: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీలకు బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్ స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఎంపీ స్థానాన్ని గెలిపించినందుకు ఉపాధి కూలీలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయోత్సవ సంబరాలు నిర్వహించి అనంతరం ఉపాధి కూలీలకు స్వీట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులున్నారు.

జిల్లా అంతటా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



ఆర్మూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు



మొక్కలను నాటుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్5: పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సాయి ఆదర్శ మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో మండలంలోని పలు వార్డులలోని ఇంటింటికి నిమ్మ, జామ, మామిడి మొక్కలు పంపిణీ చేశారు. పలు చోట్ల స్వచ్ఛందంగా సంఘ సభ్యులు పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెత్తను తొలగించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కమల,అక్షయ్, ఖాజాబీ,రణవీర్, అనిషా,గీత, సైదవ్వ, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ప్రతీఒక్కరు పర్యవరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం అన్నారు. బుధవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్యా వరణాన్ని కాపాడడానికి మొక్కలు పెంచడంతో పాటు అన్ని రకాల జీవ జాతులను రక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పాస్టిక్ రహిత సమాజా న్ని నిర్మించినప్పుడే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ కొరకు అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేష్, ప్ర శాంత్, నరేష్, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో తెలంగాణ సాం ఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థినిలు పర్యావరణాన్ని కాపాడాలని పాటలు పడుతూ ప్రధానకూ డళ్ల వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం పర్యావరణంపై ప్రజ లకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.ధనవేణి, వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఏపీవో ఇందిరా అన్నారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య,పంచాయతీకార్యదర్శి, కూలీలు పాల్గొన్నారు.

రుద్రూరు:పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామ పంచాయితీలోని ఫారంపాండు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మనోహర్, గ్రామ కార్యదర్శి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

నవీపేట,జూన్5: ప్రస్తుత వర్షకాల సీజన్‌లో హరితహారాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో నాగనాథ్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో 3,700 చొప్పున మొక్కలు నాటాలని, మండలంలో 1,18,400 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రుల ఆవరణలతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో నాందేవ్, తదితరులున్నారు.

జనసైనికుల సంబరాలు

ఆర్మూర్‌టౌన్,జూన్5: పట్టణంలో జనసేన పార్టీ సైనికులు బుధ వారం సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ళ కల నెరవేర డంతో పవన్ కల్యాణ్ అభిమానులు పట్టణంలోని జంబిహన్మాన్ ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి మొ క్కులు తీర్చుకున్నారు. పోటీ చేసిన 21స్థానాల్లో గెలుపొందడంతో సం తోషాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జనసేన అభిమానులు జంబికుశల్,కళ్యాణ్,శ్రీధర్,శ్రీకాంత్,రఘువరన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

ముప్కాల్, జూన్5: రైతులకు నకిలీలు విత్తనాలు అమ్మితే చట పరమైన చర్యలు తీసుకుంటామని బాల్కొండ వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంయుక్తంగా బాల్కొండలోని ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు రశీదు తప్పనిసరి ఇవ్వాలని అన్నారు. డీలర్లు సంబంధిత స్టాక్ రిజిష్టర్‌లు బిల్లులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు లైసెన్స్ వద్ద గల డీలర్ల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంటల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎఎస్సై శంకర్‌లు పాల్గొన్నారు.

నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నవీపేట,జూన్5: మండలంలోని నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు బుధవారం బీఎస్ఎన్ఎల్ టెక్నికల్ అధికారి శేఖర్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన జరిపారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన సిగ్నల్స్ రాకపోవడంతో రేషన్ సరుకుల సరఫరా, పింఛన్‌దారులు, ఉపాధి హామీలకు చెల్లింపుల విషయంలో ఇబ్బందులు జరుగుతున్నాయని ఈ నెల 1న జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్య కిషన్ రావు తదితరులున్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ

కోటగిరి,జూన్5: కోటగిరి మండలంలోని ఎత్తొండ, కొత్తపల్లి గ్రామాలలో పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను బుధవారం మండల ఆరోగ్య విస్తీరణ అధికారి గోవర్ధన్ తనిఖీ చేశారు. క్లినిక్‌లలో ప్రథమ చికిత్స అందించే సిబ్బంది వివరాలు సేకరించారు. క్లినిక్‌ల పరిసరాలను పరిశీలించారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్‌ల సర్టిఫికేట్‌లు, ఆధార్ కార్డులు, ఫోటోలను పరిశీలించారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీల, సరోజ, లలిత తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



అమెరికాలో ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూన్5: ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమవంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. ఎమ్మె ల్యే రాకేష్‌రెడ్డి అమెరికా పర్యాటనలో భాగంగా బుధవారం ప్రవాస భారతీ యులతో కలిసిడల్లాస్‌లోని శ్రీ వెంకట సత్యనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఎన్ ఆర్ఐలు పెట్టుబడులు పెడితే ప్రభుత్వం ప్రొత్సహం అందిస్తుందన్నారు. రైతులకు సంబంధించిన ఫ్రుడ్‌ప్రాసెస్ యూనిట్‌లు ఏర్పాట్లు చేస్తే అన్ని విధాలుగా సహకారం అందిస్తానని రాకేష్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

శెట్‌పల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శెట్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మోర్తాడ్, జూన్5: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో 2007-08 విద్యసం వత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనాటి పదో తరగతిలో విద్యనభ్యాసించిన విద్యార్థిని, విద్యార్థులు అనాటి తిపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన తాము తమ కుటుంబ వివరాలను అప్యాయంగా ఒకరినొకరు అడిగితెలుసుకున్నారు. విద్యబుద్ధులు నేర్పిన గు రువులను గౌరవించి పూలమాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పురాణిపేట్‌లో ఉరేసుకొని ఒకరి మృతి



మృతుడు నర్సయ్య

భీమ్‌గల్‌రూరల్, మేి5: భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్‌లో భుధవారం ఉదయం గ్రామంలోని ప్రధాన కూడలివద్ద ఉన్న చెట్టుకు అదే గ్రామానికి చెందిన మల్లెల నర్సయ్య వయస్సు 76 సంవత్సరాల వ్యక్తి ఉరేసుకొని చనిపోయాడు. భీమ్‌గల్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం మల్లె ల నర్సయ్య గత కొద్ది కాలంగా మానసిక పరి స్థి తిసరిగ్గా లేకపోవడంతో చనిపోయినట్టు తెలిపా రు. మృతినిభార్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.



తిమ్మాపూర్‌లో చేపల యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఎం రమేష్‌బాబు

చేపల పెంపకానికి రైతులు ముందుకు రావాలి

● డీపీఎం రమేష్‌బాబు

బీర్కూర్, జూన్ 5: చేపల పెంపకానికి రైతులు ముందుకు రావాలని డీపీఎం రమేష్‌బాబు రైతులను కోరారు. బుధవారం ఆయన బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఒక రైతు తన పొలంలో చేపల పెంపకం కోసం నిర్మిస్తున్న ఫాంపండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో పంటలతో పాటు చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలన్నారు. ప్రభుత్వం చేపల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. చేపల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు 3.35 లక్షల బ్యాంకు రుణం అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీసుకున్న రుణంలో 35 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అనంతరం బీర్కూర్ మండల కేంద్రంలో టైలరింగ్ సెంటర్‌ను పరిశీలించారు. 10వ తేదీలోపు విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టించి ఇవ్వాలని నిర్వాహకులతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న జహీరాబాద్ ఎంపీ, జుక్కల్ ఎమ్మెల్యే

ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

మద్నూర్/పెద్దకొడప్‌గల్, జూన్ 5: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన సురేష్‌షెట్కార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శాలువా తో సన్మానించారు. జహీరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి తిరు గులేదని నిరూపించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీగా గెలుపొందిన సురేష్‌షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావును అభినందించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ఏడు అసెంబ్లీల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు.



షబ్బీర్‌అలీ, సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

షబ్బీర్‌అలీ, సురేష్ షెట్కార్‌లకు సన్మానం

భిక్కనూరు, జూన్ 5: జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్ విజయం సాధించడంతో భిక్కనూరు మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఎంపీని, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు శాలువతో సన్మానించి వారికి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధరాములు, నాయకులు లింబాద్రి, మహిపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, అంకం రాజు, వెంకటేష్, దయాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి, జూన్ 5: నూతనంగా ఎన్నికైన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను బుధవారం తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎంపీగా ఉన్న సమయంలో సురేష్‌షెట్కార్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్రాంరెడ్డి, రాజు, శ్యాంరావు, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్ గెలుపుతో ఆలయంలో పూజలు

పెద్ద కొడప్‌గల్: జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ విజయం సాధించడంతో బుధవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడుతూ తమ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి 313 ఓట్ల మెజారిటీ వచ్చిందని, మండలంలోనే తమ గ్రామం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి అధిక మెజారిటీ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహిద్దీన్ పటేల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మొక్కను నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్

కామారెడ్డి టౌన్, జూన్ 5: పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం వల్ల పర్యావరణాన్ని రక్షించిన వారమవుతామన్నారు. మానవాళికి ఆక్సిజన్ చాలా ముఖ్యమని దానికి దోహదపడేదే చెట్లు కావున అందరూ సమిష్టిగా కృషిచేస్తూ పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయాధికారి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగరాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి సుధాకర్, డీఎల్‌ఎస్‌ఏ పీపీలు రాజగోపాల్‌గౌడ్, శ్యామ్‌గోపాల్‌రావు, లక్ష్మీనర్సింహారెడ్డి, రమేష్‌చంద్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం బాన్సువాడ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి కుమారి టీఎస్సీ భార్గవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లు మానవాళికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, రమాకాంత్‌రావు, ఖలీల్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీర్కూర్: మండలంలోని వీరాపూర్ గ్రామంలో మహిళలు మొక్కలు నాటారు. బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత వీరాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుమలత సందర్శించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు తదితరులు ఉన్నారు.

మద్నూర్: మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షిద్దామనే నినాదంతో డోంగ్లి ఆసుపత్రిలో వైద్య సిబ్బంది మొక్కలకు నీళ్ళు పోసి రాబోయే వర్షాకాలంలో మొక్కలు పెంచాలని గుర్తుచేశారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాబోయే వర్షాకాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా తమవంతు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మొక్కలు నాటే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే చెట్లను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమి ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీరాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



పొల్కంపేటలో ఈదురు గాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు



రాంపూర్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందిన మేక

లింగంపేటలో ఈదురు గాలుల బీభత్సం

● ఆరు గ్రామాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

లింగంపేట, జూన్ 5: మండలంలో బుధవారం ఈదురు గాలుల బీభత్సానికి ఆరు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి దీంతో అపార నష్టం సంభవించింది. మండలంలోని పొల్కంపేట, జల్దిపల్లి, అయ్యపల్లి, పర్మల్ల, ఐలాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పొల్కంపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన స్తంభాలు, చెట్లు కూలిపోయాయి. ఐలాపూర్ రాంపల్లి గ్రామాల మధ్యగల రోడ్డుపై మామిడి చెట్లు విరిగి పడడంతో పోతాయిపల్లి, కోమట్‌పల్లి, రాంపల్లి, రాంపల్లితండాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జల్దిపల్లి గ్రామంలో మేకల పుష్పలత, మన్నె బాల్‌రాజ్, కోలగారి గంగారాంలకు చెందిన ఇండ్లపై రేకులు కొట్టుకు పోయాయి. మాదారి సంగమేశ్వర్‌కు చెందిన కిరణాషాపుపై కరెంటు స్తంభం విరిగిపడింది. రాంపూర్‌లో గాలివానకు నేల కూలిన విద్యుత్ స్తంభాలు తీగలకు తగిలి మేతకు వెళ్లిన మూడు మేకలు మృతి చెందాయని బాధితుడు హనుమంతు బోరున విలపించాడు. అయ్యపల్లి, పర్మల్ల గ్రామాల్లో ఈదురు గాలులకు స్తంభాలు విరిగిపడ్డాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో రైతులకు తీవ్ర నష్టం సంభవించింది.

ధర్మారావుపేటలో నీటి ఎద్దడి

సదాశివనగర్, జూన్ 5: మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో మంచినీళ్ల సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని కొన్నిబోర్ మోటార్లు కాలిపోవడం, గోదావరినీరు సరిగ్గా రాకపోవడంతో నానా తంటాలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. నీటి ఎద్దడి ఉందనిఅధికారులకు వివరించిన పట్టించుకున్న నాధుడేలేకుండా పోతున్నారని పేర్కొంటున్నారు.ఇప్పటికైన అధికారులు కల్పించుకుని సత్వరమే నీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ ట్యాంకర్‌ను కూడా నీళ్ల రాని రోజు నీళ్ల అందించేందుకు ఉపయోగిస్తే కొంతైన మేలు జరుగుతుందని,పాడైన బోర్లు బాగుచేయాలని కోరుతున్నారు.



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై జాగ్రత్త వహించండి

పెద్ద కొడప్‌గల్, జూన్ 5: మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలని పెద్ద కొడప్‌గల్ ఏఎస్‌ఐ రాములు ప్రజలకు సూచించారు. సైబర్ క్రైం దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రజలకు సైబర్‌నేరాలపై జాగ్రత్తలు సూచించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రాములు మాట్లాడుతు ప్రస్తుతం రైతులకు పంట డబ్బులు వచ్చే సమయం ఉన్నందున ఎవరైనా బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఓటిపి చెప్పాలని సూచించిన, ఖాతా వివరాలు అడిగిన చెప్పరాదని సూచించారు. దీంతో పాటుగానే సైబర్ నేరగాళ్లు ఏదో ఒక పోలీస్ స్టేషన్‌లో మీ మీద కేసు అయిందని ఈ కేసు తొలగించాలంటే డబ్బులు ఖాతాలలో వేయమని అడుగుతున్నారని, ఇలా ఎవరైనా ఫోన్ చేసిన సంబందిత పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణ చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుండి నగదు అపహరించడం జరిగితే 1930 కు ఫోన్ చేస్తే ఆ ఖాతాను ఆపివేయడం జరుగుతుందని తెలిపారు.

గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా మారుద్దాం

పెద్ద కొడప్‌గల్, జూన్ 5: మండలంలోని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలను మారుద్దామని మండల ఇంచార్జి ఎంపిడివో సూర్యకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని టి కారం తాండాలో ప్రజలకు అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంపిడివో సూర్యకాంత్ మాట్లాడుతు గ్రామాలలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడటం వలన పర్యావరణం కలుషితం అవుతుందని ప్లాస్టిక్ వాడరాదని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, ఉపాధి హామి కూలీలు పాల్గొన్నారు.

కల్లాలకు స్థలాలను గుర్తించాలి



చింతామన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

దోమకొండ, జూన్ 5: రైతులు పండించిన ధాన్యాన్ని అరబెట్టేందుకు గ్రామాల్లో స్థలాలను గుర్తించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంచనూర్, సంగమేశ్వర్, గొట్టిముక్కుల, దోమకొండ, ముత్యంపేట, చింతమాన్‌పల్లి గ్రామాల్లో రైతు కల్లాల నిర్మాణం ఏర్పాటుకు స్థలం, ఇతర వివరాలపై ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో వేర్వేరుగా రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఆర బెట్టేందుకు కల్లాలను ప్రతీ గ్రామంలో నిర్మాణం చేయుటకు రైతులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 12వ తేదీ నాటికి రైతులు తమ గ్రామాల్లో రైతు కమిటీలు ఏర్పాటు చేసి స్థలాన్ని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మాద్దూరి భూపాల్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, కుంట లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కోతపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన రైతులు

మండలంలోని గొట్టిముక్కుల, దోమకొండ, ముత్యంపేట గ్రామాలకు చెందిన రైతులు వరి ధాన్యం విక్రయించి 15 రోజులైనప్పటికీ తమకు ఓటీపీ రాలేదని ఎమ్మెల్యే రమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైస్ మిల్లులో లారీలు వెళ్లినపుడు కటింగ్ చేశారని ఆ నష్టం భరించడం, ఓటీపీ లేట్ కావడం విషయాలను ఎమ్మెల్యేకు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులకు ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు నష్టం జరిగేలా చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.

ఏదైనా ఒక్కపేరునే పెట్టాలి

తమ గ్రామానికి గొట్టిముక్కుల, సీతారాంపూర్ అనే రెండు పేర్లు ఉన్నాయని అందువల్ల గ్రామానికి చెందిన యువత, ప్రజలు కొన్ని రకాలుగా నష్టపోవడం జరుగుతుందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఏదైన ఒకే పేరు అన్ని రికార్డులు, కార్యాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామంలో రెండు ముఖ్యమైన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

రేణుకాదేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోని ముత్యంపేట గ్రామంలోని రేణుకాదేవి ఆలయంలో గౌడ సంఘం సభ్యుల కోరిక మేరకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి అమ్మవారి ఫోటోను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని,పాడి, పంట, పిల్ల, పాపలతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ మేరకు రైతు కల్లాల నిర్మాణం

బీబీపేట: మండల కేంద్రంతో పాటు మల్కాపూర్, తుజాల్‌పూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ గ్రామాలలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కల్లాల నిర్మాణానికై రైతులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతుల కల్లాల కోసం స్థల సేకరణ జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ భూమి ఉంటే ఆ ప్రాంతంలో, ప్రభుత్వ భూమి లేని యెడల సొంతగా స్థలాన్ని కొని రైతులకు కల్లాలను నిర్మిస్తానని అన్నారు. వచ్చేవానాకాలం పంటను ఆ కల్లాలోనే ఆరాబోసే విధంగా ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజాపాలన లబ్దిదారుల ఎంపిక జరిగే అవకాశం ఉన్నందున తానే స్వయంగా లబ్దిదారుల ఇంటికి వచ్చి ఎంపిక చేస్తానని అన్నారు.

గుండెనొప్పితో సొసైటీ డైరెక్టర్ మృతి

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ తలారి రాజయ్య(52) గుండెనొప్పితో ఒంటిమామిడిలోని ఆసుపత్రిలో చేరాడు. మంగళవారం వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించగా తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు సన్నిహితులు తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే రాజయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

10 శాతం విరిగిన సన్న బియ్యం పంపిణీ చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, జూన్ 5: నిర్దేశించిన లక్ష్యం మేరకు వరి ధాన్యాన్ని సేకరించి 10 శాతం విరిగిన సన్న బియ్యం పంపిణీ చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌర సరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. యాసంగి 2023-24 సీజన్‌లో సన్న రకం వరి ధాన్యం పొందిన మిల్లర్లతో ఆయన మాట్లాడారు. లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైస్‌మిల్లుల యజమానులు లక్ష్యాలను పూర్తి చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మల్లికార్జున్‌బాబు, ఇన్‌చార్జ్ సివిల్ సప్లయ్ మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్ యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

బీబీ పాటిల్ స్వగ్రామంలో కాంగ్రెస్‌కు ఆధిక్యం

మద్నూర్, జూన్ 5 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి గాను జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ స్వగ్రామం జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల పరిధిలో గల సిరిపూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు 426 ఓట్లు రాగా, బీబీ పాటిల్ బీజేపీ అభ్యర్థి 348 ఓట్లు వచ్చాయి. మొత్తం మీద ఆ గ్రామంలో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు 78 ఓట్లు తక్కువగా వచ్చాయి. గతంలో రెండు సార్లు ఎంపీగా చేసిన బీబీ పాటిల్‌తో పాటు మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉన్నప్పటికీ తక్కువగా రావడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి మండలంలో బీజేపీకి, కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల వివరాలు

ఉమ్మడి, మద్నూర్, డోంగ్లీ మండలాల్లో బీజేపీకి ఓట్లు వచ్చిన గ్రామాల్లో మద్నూర్ 2,470, డోంగ్లీ 885, మేనూర్ 853, పెద్దఎక్లారా 784, పెద్దతడుగూర్ 753, కాంగ్రెస్ పార్టీకిపై గ్రామాల్లో వచ్చిన ఓట్లు మద్నూర్ 1,626, డోంగ్లీ 765, మేనూర్ 657, పెద్దఎక్లారా 539, పెద్ద తడ్గూర్ 631 ఓట్లు పోలయ్యాయి.

తిప్పాపూర్‌లో రైతులకు అవగాహన

భిక్కనూరు, జూన్ 5: భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఏవో రాధ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

దర్పన్	- గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
శాంతి	- గమ్‌గమ్ గణేషా
ప్రియా 70	- బజే వాయు వేగం
ప్రియా 35	- లవ్ మీ ఇఫ్ యూ డేర్

బాన్సువాడ

మహేశ్వరి	- భజే వాయు వేగం
వెంకటేశ్వర	- గం గం గణేశా

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	151	219	249
వెన్‌కాబ్ (కిలో)	:	162	222	260

